క్లుప్తంగా

ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ



వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

ఆస్పరి: మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో వాల్మీకి మహర్షి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం కల్లు హోళే మఠం పీఠాధిపతి చన్నవీర శివాచార్య స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు స్వామికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

తప్పిన ప్రమాదం



సబ్ స్టేషన్ ఆవరణలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆలూరు రూరల్: స్థానిక కోయనగర్ కాలనీలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో చెత్తకు నిప్పంటుకుంది. సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్‌తో అధికారులు, సిబ్బంది అక్కడి చేరుకుని మంటలు ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో కాలనీ వాసులు ఊపిరిపీల్చుకున్నారు. సబ్ స్టేషన్‌కు అనుకొని ఎస్సీ బాలికల వసతి గృహం, ఎంపీపీ పాఠశాల ఉంది.

సిట్టింగ్ స్క్వాడ్ తనిఖీ

హొళగుంద: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సోమవారం ఇంటర్ సెకండియర్ పరీక్ష కేంద్రాన్ని సిట్టింగ్ స్క్వాడ్ సంజప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. మ్యాథ్స్, జువాలజీ పరీక్షలు జరుగుతుండగా పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు సంజప్ప తెలిపారు. కేంద్రంలో మొత్తం 100 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ ప్రవీణ తెలిపారు.

యువత పోరుకు తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: ఈనెల 12న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరుద్యోగులు, విద్యార్థుల పక్షాన చేపట్టిన యువత పోరుకు నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజలు తరలిరావాలని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. ఈ మేరకు కర్నూలులో సోమవారం కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, తన నియోజకవర్గ వెల్దుర్తి, కృష్ణగిరి తదితర మండలాల నాయకులతో కలిసి యువత పోరుకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ, అనుబంధ విభాగాల రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు బోయనపల్లె అశోక్ రెడ్డి, ఎస్‌హెచ్ ఎర్రగుడి వై రాజశేఖర్, అల్లుగుండు శ్రీరాంరెడ్డి, రామకృష్ణాపురం సుభాష్, గూడెంపాడు శ్రీనాథ్‌రెడ్డి, నరేంద్ర రెడ్డి సోదరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణగిరి మండలం ఎస్‌హెచ్ ఎర్రగుడి వై.రాజశేఖర్ నియమించబడటంతో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డిని కర్నూలులో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం

చిప్పగిరి: సేంద్రియ ఉత్పత్తులతో మంచి ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ అల్లాబకాష్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయల స్టాల్ ఏర్పాటు చేశారు. ఐసీఆర్పీలు రంగయ్య,రాజశేఖర్,ఝాన్సీ పాల్గొన్నారు.

సకాలంలో సమస్యల పరిష్కారం

మద్దికెర : మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

న్యాయం చేయండంటూ ఆందోళన

వెల్దుర్తి: తమ భూములను తమ దాయాదులు ఆక్రమించుకున్నారని, ఆక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారని, తమకు న్యాయం చేయాలని సోమవారం పట్టణానికి చెందిన రాజేశ్, కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. అంతకు ముందు రాజేశ్, అతని తండ్రి, తల్లి, సోదరి ఆర్జీ మేరకు తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ ఆర్‌ఓఆర్ విచారణ చేపట్టారు. దీంతో రాజేశ్ కుటుంబ సభ్యులు, వైరి వర్గంలోని అతని పెద్దనాన్న, చిన్నాన్న కుటుంబ సభ్యులు కార్యాలయం చేరుకున్నారు. దాయాదులిద్దరూ ఎదురుపడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని సముదాయించారు. అయితే రాజేశ్ వర్గం శాంతించకపోగా కార్యాలయం ఎదుట బైఠాయించి తనకు న్యాయం చేయాలని రోదించారు. ఇరువర్గాల వాదనలు విన్న తహసీల్దార్ పోలీసు పహారా మధ్య విచారణ కొనసాగించారు.



ఖైరుప్పలలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఏపీడీ పద్మావతి (ఫైల్)

కూటమి నేతల కాటు.. కూలీలకు చేటు

- ఉపాధి హామీ పథకంపై కూటమి నేతల పెత్తనం
- బలవంతంగా ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు
- తమ అనుచరుల నియామకం
- రాజకీయ వ్యవహారాలతో పనులకు అడ్డంకి
- రోజుల తరబడి ఉపాధికి దూరమవుతున్న కూలీలు

ఆలూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీ పథకంలో ఆయా పార్టీల నాయకుల జోక్యం మితిమీరిపోయింది. గ్రామాల్లో భయానక వాతావరణం సృష్టించడమే కాకుండా కూలీలు ఉపాధికి దూరమయ్యేలా చేస్తున్నారు. వారి రాజకీయ చర్యలతో అనేక కుటుంబాల నోటి కాడి కూడును లాగేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, దేవనకొండ, హలహర్వి, హోళగుంద మండలాల్లో దాదాపు 25వేల జాబ్ కార్డులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం 2024 జూలై 4న అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు తమ వర్గానికి చెందిన వారే ఫీల్డ్ అసిస్టెంట్లుగా ఉండాలని ప్రస్తుతం పనిచేస్తున్న వారిని బలవంతంగా తొలగించడం, లేదా వారే రాజీనామా చేసేలా ఒత్తిడి పెంచారు. ఇలా బలవంతంగా ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చడంతో ఆయా గ్రామాల్లో రోజుల తరబడి పనులు నిలిచిపోయి కూలీలు పనులకు దూరమయ్యారు.

టీడీపీ నేతల దురాగతాలు ఇలా..

- ఆలూరు మండలం ఆరికేరి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కురువ ఈరన్నను జనవరి 24న ఫీల్డ్ అసిస్టెంట్ పదవిని వదులకోవాలని ఒత్తిడి చేశారు. అతను స్పందించకపోవడంతో దారుణంగా హత్య చేశారు. ఆనాటి నుంచి నేటి వరకు గ్రామంలో ఉపాధి హామీ పనులు నిలిచిపోయాయి.
- మార్లమడికి గ్రామంలో మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ గాదిలింగ మృతి చెందాడు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా వ్యవహరిస్తున్న అతని భార్య విశాలాక్షి దాదాపు 20 రోజుల పాటు కూలీలకు పనులు చూపలేదు. దీంతో గ్రామంలో నిరుపేదలు ఉపాధికి దూరమయ్యారు.
- గజ్జహళ్లి, ఎల్లార్తి గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు రంజాన్ సాహెబ్, వైకుంఠం యఫ్ ఏలుగా మానుకోవాలని కూటమి నేతలు ఒత్తిడి చేయడంతో అక్కడ కూడా తాత్కాలికంగా ఉపాధి పనులు నిలిచిపోయాయి.
- నెరణికి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ దేవప్పపై కూటమి నేతలు ఒత్తిడి చేయడంతో 10 రోజుల పాటు పనులు ఆగిపోయాయి.
- చిప్పగిరి మండలంలో గుమ్మనూరు, ఖాజీపురం, రామదుర్గం గ్రామాలకు ఫీల్డ్ అసిస్టెంట్లు లేనందున అక్కడ కూడా పనులు జరగడం లేదు.
- ఆస్పరి మండలం బిల్లేకల్లు, బనవనూరు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు పోస్టులు మూడు నెలల నుంచి భర్తీ చేయలేదు, తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో పనులు జగడం లేదు.
- దేవనకొండ మండలంలోని బండపల్లి, బేతపల్లి, నల్లచెలిమిల, పలిదొడ్డి, పొట్లపాడు, నేలతలమర్రి గ్రామాల్లో మూడు నెలలు నుంచి ఉపాధి కూలీలకు పనులు కల్పించలేక పోతున్నారు.
- పొట్లపాడు గ్రామంలో రామాంజిని, సుధాకర్ మధ్య వర్గ విభేదాల కారణంగా ఫీల్డ్ అసిస్టెంట్ నాగార్జున రెండు నెలల నుంచి పనులు నిలిపివేశారు.
- హాలహర్వి మండలం నిట్రవట్టి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పట్టప్ప, విరుపాపురం ఫీల్డ్ అసిస్టెంట్ సోమప్ప కూటమి నేతల ఒత్తిడి భరించలేక రాజీనామా చేశారు.

> ప్రస్తుతం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 108 గ్రామ పంచాయతీలకు గాను 94 మంది మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. 14 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కూటమి నాయకుల చర్యల కారణంగా మొత్తం మీద 8వేల మంది వరకు జాబ్ కార్డుదారులు పనిని కోల్పోయారు.

త్వరలో పోస్టులు భర్తీ చేస్తాం

ఖాళీగా ఉన్న ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులను భర్తీ చేయాలని అధికారులకు ఇప్పటికే నివేదించాం. కొన్ని గ్రామాల్లో సీనియర్ మేటీలు ద్వారా ఉపాధి పనులు కొనసాగించేందకు చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పోస్టులు భర్తీ చేస్తాం. ఆయా గ్రామాల్లో పనులు పునరుద్ధరించేలా చర్యలు చేపడతాం.

– పద్మావతి, ఏపీడీ,ఆలూరు

హామీల అమలు ఎప్పుడు బాబూ?



కరిడికొండలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

దేవనకొండ: కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలంటూ గొప్పలు చెప్పి ప్రజలను నిలువునా చేసిందని, బాబూ హామీలు ఎప్పుడు అంటూ ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి ప్రశ్నించారు. మండలంలోని కరిడికొండ గ్రామంలో ఓ శుభకార్యానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన నాయకులు, కార్యకర్తలతు సమావేశమయ్యారు. మండలంలో పార్టీ నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలు, కూటమి నాయకులు వేధింపులపై చర్చించారు. జెడ్పీటీసీ రామకృష్ణ, నాయకులు కప్పట్రాళ్ల దివాకర్‌నాయుడు, ప్రేమనాథ్‌రెడ్డి, ఎల్.కె.శీను, పొట్లపాడు ఆనంద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవర

కృష్ణగిరి: జి.మల్లాపురంలో సుంకులమ్మ అమ్మవారికి, టి.గోకులపాడులో పెద్దమ్మ, కత్రమ్మ, రాములమ్మ అమ్మవార్లకు ఆయా గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో దేవర నిర్వహిస్తున్నారు. మల్లాపురంలో సోమవారం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మంగళవారం బోనాల సమర్పణ ఉంటుందన్నారు. గోకులపాడులో సోమవారం గణపతి పూజతో దేవర ప్రారంభించిన గ్రామపెద్దలు మంగళవారం నైవేద్యం, బుధవారం బోనాల సమర్పణ ఉంటుందని తెలిపారు.

యువతపోరులో ప్రభుత్వాన్ని నిలదీద్దాం

- 12న కర్నూలుకు తరలిరండి
- వైఎస్సార్‌సీపీ నాయకుల పిలుపు



పత్తికొండలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

పత్తికొండ రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన కర్నూలులో నిర్వహించనున్న యువత పోరులో ప్రభుత్వాన్ని నిలదీద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం అధికార ప్రతినిధి శ్రీరంగడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమలుకు నోచుకోని హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేస్తుందని దుయ్యబట్టారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఆయన తనయుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మరింత మెరుగుపరచి అమలు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా నిలిపేసిందని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే 20లక్షల ఉద్యోగాలిస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన నాయకులు..ఇప్పటివరకు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ పూరించిన సమరశంఖంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎంపీపీ నారాయణదాస్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమశేఖర్, మండల కన్వీనర్ కారం నాగరాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, నాయకులు, హోసూరు శ్రీనివాసులు, ఎంపీటీసీ నీలకంఠ, రవి పాల్గొన్నారు.

రాష్ట్ర నాయకులకు సన్మానం..

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో రాష్ట్రస్థాయిలో పదవులు పొందిన పత్తికొండకు చెందిన రాష్ట్ర మేధావుల ఫోరం అధికార ప్రతినిధి శ్రీరంగడు, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌ను పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

పెండింగ్ ఉపాధి వేతనాలు చెల్లించాలి



ఆలూరులో సచివాలయ సెక్రటరీకి వినతి పత్రం అందిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆస్పరి: పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆస్పరిలో ఈసీ ఖాజాకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 9 వారలైనా వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు.రామాంజనేయులు, మధుసూదన్‌రెడ్డి, మహానంది, ఈరన్న, వీరేంద్ర, ప్రకాష్ పాల్గొన్నారు.

దేవనకొండ: కష్టపడి పనిచేసి తొమ్మిది వారాలు గడిచినా ఉపాధి కూలీలకు వేతనాలను ఎందుకు చెల్లించడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్ ప్రశ్నించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీల సమస్యలపై గ్రామ సచివాలయం ముందు ఆందోళన చేపట్టారు. మండలంలోని తెర్నెకల్, దేవనకొండ, కుంకనూరు గ్రామాల్లోని సచివాలయాల కార్యదర్శులకు వినతి పత్రాలను అందజేశారు.సీఐటీయూ మండల కార్యదర్శి అశోక్, సీనియర్ నాయకులు బజారి, శ్రీనివాసులు, రామాంజనేయులు, లక్ష్మిరెడ్డి, హనుమంతు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆలూరు రూరల్: ఉపాధి హామీ పథకం కూలీలకు అందించాల్సిన 10 వారాల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం మండల నాయకుడు హనుమంతు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సచివాలయం–3 ముందు సోమవారం ఉపాధి కూలీలతో కలిసి ధర్నా చేపట్టి సచివాలయ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. వలసల నివారించేందుకు కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్న ప్రభుత్వం వారికి వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. నెలలు గడుస్తున్నా వేతనాలు అందించకపోవడంతో వారి జీవనం దుర్భంగా మారిందన్నారు. కార్మిక సంఘం నాయకులు నాగరాజు, వీరేష్, మల్లికార్జున,పవన్,మహానంది,కూలీలు పాల్గొన్నారు.

శుభకార్యం

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో సోమవారం జరిగిన శుభ కార్యక్రమాలకు ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు దర్గన్న నిర్మించిన నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై దర్గన్న దంపతులను అభినందించారు. అలాగే పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి సోదరుల పెళ్లి రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి పాల్గొన్నారు.

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

తుగ్గలి : లక్ష్మితండాలో సేవాలాల్ ఆలయ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రూ.35 లక్షల పైగా చందాలతో తండా వాసులు సేవాలాల్, మారెమ్మ దేవత ఆలయాన్ని నిర్మించారు. ఈనెల 12న సేవాలాల్, మారెమ్మ దేవత విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తండావాసులు తెలిపారు.

ఉపాధి పనులపై విచారణ

మద్దికెర : మండలంలోని గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులు, వేతనాలు గురించి ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో ఉపాధి సామాజిక తనిఖీల్లో భాగంగా విచారణ చేపట్టినట్లు డీఆర్‌పీ ఏడుకొండలు, ఎస్ఆర్‌పీ విజయ్‌భాస్కర్ తెలిపారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉపాధి కూలీలు, మేటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేసిన పనులు, వేతనాలు గురించి మేటీలను అడిగి తెలుసుకున్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో వయో భారం, జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధుడు ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు..గ్రామానికి చెందిన ముగతాళి సురకత్తుల పెద్దపెద్దయ్య (80) వయస్సు మీదపడటంతో అనారోగ్య సమస్యలు, దానికితోడు బోదకాలు ఉండటంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 9న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం ఉదయం మృతి చెందాడు. భార్య సుశీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు.

బస్సు ఏర్పాటు చేయాలి

హొళగుంద: మండలంలోని ఇంగళదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ఆదోని మండలం పెద్ద హరివాణం పరీక్షా కేంద్రానికి ఈ నెల 17– 31వ తేది వరకు వెళ్లి వచ్చేందుకు ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, కేసీ తిమ్మారెడ్డి యూత్ సభ్యులు పంపాపతి సోమవారం ఆదోనిలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం



పత్తికొండలోని నాలుగు స్తంభాల కూడలిలో సీపీఐ ధర్నా

పత్తికొండ రూరల్ : జిల్లాలో ఉన్న ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని పత్తికొండలోని నాలుగు స్తంభాల కూడలిలో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేపట్టారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఆందోళనను‌ద్దేశించి సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులు వేదవతి, ఆర్డీఎస్ కుడికాలువ, గుండ్రేవుల రిజర్వాయర్, ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ హంద్రీనీవా, నూతన పరిశ్రమల ఏర్పాటును ప్రభుత్వం విస్మరించిందన్నారు. అనంతరం సమస్యలపై తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. పార్టీ అనుబంధ సంఘాల నాయకులు గురుదాస్, సురేంద్రకుమార్,కృష్ణ, గిడ్డయ్య, అల్తాఫ్, గుండుబాషా, నెట్టికంటయ్య పాల్గొన్నారు.

ఆస్పరి: రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులో కర్నూలు జిల్లాకు అన్యాయం చేశారని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఆస్పరిలో రాస్తారోకో చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో వేదావతి, గుండ్రేవుల రిజర్వాయర్, ఆర్డీఎస్ కుడి కాలువకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తామని చెప్పి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మొండి చేయి చూపాడన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాగేంద్రయ్య, విరుపాక్షి, బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, అంజినయ్య, కృష్ణ, బడేసాహెబ్ పాల్గొన్నారు.

హొళగుంద: కర్నూలు జిల్లాకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండ కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని సీపీఐ మండల కార్యదర్శి పెద్యాట మారెప్ప ఆరోపించారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో హొళగుందలో నిరసన కార్యక్రమం చేపట్టి ఇన్‌చార్జ్ తహసీల్దారు నిజాముద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. మారెప్ప మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు వేదావతి, గుండ్రేవుల రిజర్వేయర్, ఆర్డీఎస్ కుడి కాలువకు నిధులు కెటాయించి పూర్తి చేస్తానని హామినిచ్చి నేడు కేవలం రూ.30 కోట్లు మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. రంగన్న, వెంకన్న, సలాంసాబ్, హినాహిత్, మల్లయ్య, రాము పాల్గొన్నారు.

దేవనకొండ: రాష్ట్ర బడ్జెట్‌లో కర్నూలు జిల్లాకు కేటాయించిన అరకొర నిధుల కేటాయింపు వల్ల జిల్లా ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసారావు ఆరోపించారు. సోమవారం సీపీఐ జిల్లా సమితి పిలుపులో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ మండల నాయకులు బి.ఎస్.అబ్బాస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: రాష్ట్ర బడ్జెట్‌లో కర్నూలు జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని, ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల మేరకు కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలని సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో సీపీఐ, అనుబంధ సంఘాల ప్రతినిధులు స్థానిక పాతబస్టాండులో రాస్తారోకో చేపట్టారు. రాజు, చిలిపి కృష్ణ, వెంకటేశ్వర్లు, అనిల్, బాలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అరెస్టు అన్యాయం

పత్తికొండ రూరల్ : సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడకు వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు ఎక్కడికక్కడే నిర్బంధించి జైలుకు పంపించడం అన్యాయమని సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి, సీనియర్ నాయకుడు దస్తగిరి అన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ సోమవారం స్థానిక ఈశ్వరరెడ్డి భవన్ నుంచి పత్తికొండలోని నాలుగు స్తంభాల కూడలి వరకు ర్యాలీగా వచ్చి ఆందోళన చేపట్టారు.

వెల్దుర్తి: మహాధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్న అంగన్‌వాడీ వర్కర్లను అక్రమ అరెస్టులు చేయడం సరికాదని అంగన్‌వాడీ కార్యకర్తలు ఖండించారు. సీపీఐ మండల కార్యదర్శి టి కృష్ణ, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మాధవస్వామితో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మకు వినతిపత్రాన్ని అందించారు.

అగ్ని ప్రమాదం



ఎరుకులచెరువులో గడ్డివాముల మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



అమకతాడులో దగ్ధమైన వ్యవసాయ సామగ్రి

కృష్ణగిరి: మండలంలోని ఎరుకుల చెరువు, అమకతాడు గ్రామాల రైతుల పొలాల్లో సోమవారం అగ్ని ప్రమాదాలు సంభవించాయి. ఎరుకులచెరువులో మొలక సుంకన్న తన కల్లంలో జొన్న, వరి, వేరుశనగ చొప్పతో వేసుకున్న మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. వ్యవసాయ సామగ్రి, పైపులు కాలిపోయాయి. ప్రమాదాన్ని గుర్తించిన రైతు ఆర్పే ప్రయత్నం చేస్తూ డోన్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాడు. వారు సంఘటనాస్థలికి చేరుకుని మంటలు పక్కలకు వ్యాపించకుండా ఆర్పేశారు. అప్పటికే రూ.2లక్షల పైచిలుకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అమకతాడులో పొలం గట్లకు పెట్టిన నిప్పు పొలాలకు వ్యాపించి గ్రామానికి చెందిన రైతు బోదెపాటి హనుమన్న పొలంలోని విద్యుత్ మోటారు, వైర్లు, స్టాటర్, పైపులు కాలిపోయాయి. రూ.80వేల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత రైతు వాపోయాడు.

మిగులు భూములు పేదలకు పంపిణీ చేయాలి



తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతి పత్రం అందిస్తున్న దళిత సంఘం నాయకులు

మద్దికెర : మండలంలోని మిగులు భూములు భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నబిరసూల్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మిగులు భూములు పంపిణీ చేయాలంటూ ధర్నా నిర్వహించారు. పనులు కల్పిస్తామని గ్రామసభల్లో ఊరడించి మూడు నెలలుగా వేతనాలు మంజూరు చేయకుండా కూలీల కడుపు మాడ్చుతున్నారని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కారుమంచి, మండల కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: సాగులో ఉన్న దళితులలకు భూహక్కు కల్పించాలని బీఎస్ఎస్ స్టేట్ ప్రెసిడెంట్ అమ్రేష్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మాల నరసప్ప అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ 1916లో హరిజన నరసప్పకు బ్రిటీషు ప్రభుత్వం భూమి మంజూరు చేసిందన్నారు. ఏళ్ల నుంచి సాగులో ఉన్న దళితు భూ యజమానులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పార్కు, ఇతర అవసరాల పేరుతో ఆన్‌లైన్ అడంగల్ మార్పు చేయడం దుర్మార్గమని చెప్పారు. విజయుడు,రామకృష్ణ,మల్లమ్మ, హుసేని,రామాంజి, గోవిదమ్మ ఉన్నారు.

మహిమాన్వితుడు హుచ్చువీరప్ప తాత

- పెద్దహోతూరులో ప్రారంభమైన ఉత్సవాలు
- 13న రథోత్సవం



:హుచ్చువీరప్ప తాత మూలవిరాట్



ముస్తాబవుతున్న రథం

ఆలూరు రూరల్: కొలిచే వారికి కొంగు బంగారంగా శ్రీ హుచ్చు వీరప్ప తాత, మరకట్టు గ్రామంలో కొలువైన చలువప్ప తాత ఖ్యాతి గాంచారు. తాతల రథోత్సవం ఈ నెల 13వ తేదీ వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు ఆలూరు మండలంలోని పెద్ద హోతూరు గ్రామంలో కొలువైన హుచ్చువీరప్ప తాత రథాన్ని ముస్తాబు చేస్తున్నారు. వేడుకల్లో భాగంగా మరకట్టులో కొలువైన చలువప్ప తాత ఉత్సవమూర్తిని పెద్దహోతూరు గ్రామానికి తీసుకొచ్చి, కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 13న ఉదయం గణపతి పూజ,సర్వ దేవతా మండల పూజ, హుచ్చు వీరప్ప తాతకు పంచామృతాభిషేకం, సుదర్శన, రుద్ర హోమం నిర్వహించి సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. 14వరకు గంగపూజ, 15న చలువప్ప తాత ఉత్సవమూర్తికి గ్రామోత్సవం నిర్వహించి మరకట్టు గ్రామం చేర్చుతారని ఆలయ అర్చకులు చంద్రమౌళి స్వామి తెలిపారు.

భక్తులను కాపాడిన హుచ్చువీరప్ప తాత..

పెద్దహూతూరులో హుచ్చు వీరప్ప తాత జీవ సమాధి అయ్యారు. పూర్వం తన మహిమలతో భక్తులను కాపాడేవారని స్థానిక చరిత్ర. హంపి క్షేత్రానికి వెళ్లి అక్కడి తుంగభద్ర నదిలోని సుడిగుండంలో దూకి మూడు రోజుల తరువాత నాగభరణంతో జలాన్ని తీసుకొచ్చాడని కథనం. ఇందుకు సంబంధించిన నాగాభరణం ఇప్పటికీ ఆలయంలో పూజలందుకుంటోంది. ఇందులో భాగంగా భక్తులు హంపికి వెళ్లి జలాన్ని తీసుకొచ్చి స్వామి వారిని అభిషేకిస్తారు. సోమవారం నుంచి ప్రారంభమైన గంగపూజ 14వ తేదీ వరకు కొనసాగిస్తారని తాత వంశీకులు సిద్దయ్య స్వామి తెలిపారు.

నేటి నుంచి రంగనాథుడి బ్రహ్మోత్సవాలు

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఈఓ వీరయ్య సోమవారం తెలిపారు. మంగళవారం ధ్వజారోహణం, విష్వక్సేన పూజ, కలశస్థాపన, అంకుర్పారణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రంగు రంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో ఆలయం వెలుగులీనుతోంది.



వెలుగులీనుతున్న శ్రీరంగనాథ దేవాలయం